# ఐ హేట్ శర్మన్స్

సౌందర్యం అంటే బ్యూటీ-బ్యూటీ అంటే నేచర్. నేచర్ అంటే గోంగూర. (గోంగూర పచ్చడికాదు) గోంగూర ప్లస్ సివిలిజేషన్ అనగా పచ్చిమిరపకాయలు ఎండుమిర్చి పోపుపెడితే గోంగూర పచ్చడవుతుంది. పోపు పెట్టడం గొప్పకళ. (రా) మనుషులకు పోపు తగిలిస్తే నాగ్రికులవుతారు. జామకాయలు, చెరకు కర్రలు, బొప్పాయి పండ్లు, దోసకాయలు, తాటి ముంజెలు, సీతాఫలాలు, మామిడిపండ్లు తినడం నేచురల్ మరియు సహజం. దోసెలు, ఇడ్లీలు బొబ్బట్లు మెక్కడం డాక్టర్ కోసం పరుగెత్తడం మోస్టులీ అన్నాచురల్... అప్పడాల పిండి ముందు తినేస్తే తర్వాత ముక్కిపోయిన అప్పడాలు కాల్చుకు తినేబాధ తప్పుతుందంటే పిల్లలమాట పెద్దవాళ్ళు చెవిని పెట్టరు.

అఫ్‌కోర్సు గేదలు, ఆవులు, కుక్కలు, కోళ్ళు గుర్రాలు నానా జాతి పిట్టలు అన్నీ నేచురల్‌గా ఉంటాయి. అవి బట్టలు వేసుకోవు.

పసిపిల్లలు కూడా బట్టలు వేయించుకోరు. వేస్తే పీక్కుంటారు, లాక్కుంటారు. దిస మొలతో పరుగెడతారు. మట్టిలోనూ బురదలోను యిసుకలోను ఆడటం వాళ్ళకిష్టం. ఒకవేళ తల్లి యమయాతన పడి ఎలాగో వాళ్ళ రూపురేఖలు తీర్చిదిద్దినా, మరుక్షణంలో వాళ్ళ అవతారాలు చూడశక్యంగా వుండవు. వుండకపోయినా వాళ్ళే ముద్దొస్తారు. దిసమొలతో తిరిగినా నెత్తిమీద మట్టిపోసుకున్నా నీళ్ళలో ఆడినా, వాళ్ళే బావుంటారు. అందం అంతా వాళ్ళదే. వాళ్ళని క్రమంగా పాడుచేసి - మనంతవాళ్ళని చేయాలని మనం తాపత్రయపడతాం. ప్రకృతి నుంచి ప్రకృతి సహజత్వాన్నుంచి పారిపోయిన పిరికి పందలం మనం. మన పిరికితనమే మన నాగరికత అదే మన సభ్యత : దటీజ్ కల్చర్ -

ఆవు పొదుగుకేసి చూడ్డం అసభ్యంకాదు. చూడుతోవున్న గేదె, ఈనిన పంది, పిల్లల్ని పెట్టిన పిల్లి, పిల్లలకోడి, పావురాల జంట, పురివిప్పుకున్న నెమలి, కొమ్మమీది కోతి, కొబ్బరి చెట్టుమీద కొండముచ్చు, రోడ్డుమీద తిరిగే కుక్కలు వీటికేసి చూడ్డం అసభ్యం కాదు. త్రాచుపాము చాలా అందంగా ఉంటుంది. సింహం గొప్ప దర్జాగా వుంటుంది. కుక్కకి పాంటూ, పిల్లికి బుష్ షర్టూ, కోతికి కళ్ళీ లాల్చీ తొడిగి చూడండి. గుర్రానికి లేసు పరికిణీ కుట్టిస్తే ఎలా వుంటుంది? గేదెకి తొమ్మిది గజాల చీర కట్టొచ్చా? ఆవుకి పెద్దాపురం పట్టుచీర కట్టబెడితే? ఇవన్నీ చేసినా వాటికి సభ్యతరాదు. ఆఫ్‌కోర్సు - కోతులకి చింపాంజీలకి సర్కస్ వాళ్ళు డ్రెస్‌లు వేస్తున్నారనుకోండి. సర్కస్ అమ్మాయిలకి డ్రెస్‌లు తీసివేస్తున్నారనుకోండి. బట్టలు వేసుకొనేవాళ్ళు అప్పుడప్పుడు ఆ బట్టలు తొలగిస్తుంటే - అసభ్యత అశ్లీలం వాట్ నాట్ అన్నీ అందులోంచి పుట్టుకొస్తాయి.

వేసుకున్న గుడ్డలు తీసేస్తే అప్పుడు సౌందర్యం నేచురల్‌గా బైటపడ్తుంది. సినిమాల వాళ్ళు పైటలు తీసేస్తారు. వంటి నంటిపెట్టుకునే దుస్తులు వేసి పరుగు లెత్తిస్తారు చెట్ల చుట్టూ - ఏదైనా నేచురల్‌గా వున్నదానికి ఆకర్షణలేదు. పొలాల్లో ఎంత మందో మనుషులు కోకలెగ్గట్టి గోచీలు పోసి పైటలు బిగించి పనులు చేసుకుంటూ వుంటారు. వర్షంలో తడిసిన మనుష్యులు ఆదరాబాదరా ఆడామగా రోడ్లమీద పరుగులెత్తు తుంటారు. ఇంట్లో ఆడాళ్ళు చిన్న బట్టకట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ఎంగిళ్ళెత్తుతూ కంచాలు కడుగుతూ పనులు చేసుకుంటూ వుంటారు. ఇదంతా అశ్లీలం, అసభ్యం అని మనం గంతులు వెయ్యటం లేదు. ఒక పేరూ వూరూ డబ్బూ దస్కం వార్డ్ రోబునిండా రకరకాల చీరలున్న ఆడది (తారకానివ్వండి) గుడ్డకట్టలేని కడుబీదరాలు కాకపోయినప్పటికీ తక్కుతూ తారుతూ గెంతు లేస్తూంటే సంగీతం, ఆపాటలూ చెవుల్ని హోరెత్తిస్తూంటే ఆ సంస్కృతి, సభ్యత, మానం మర్యాదా మంట కలిసిపోతున్నాయని గోలెడుతున్నాం. ఆడదాన్ని బజారులో పెట్టారని అలమటిస్తున్నాం.

డబ్బులిచ్చి చూశాక చూసి లోపల ఆనందించి పైకి అసభ్యం అశ్లీలం అని గావుకేకలు పెడుతున్నాం. దటీజ్ నాట్ కరక్టు మరియు గుడ్. ఇలా కేకలు పెట్టేవాళ్ళంతా పుణ్యాత్ములు, పుణ్యాత్ములంటే వాళ్ళ శరీరాలు పాపాలుచేస్తే చెయ్యొచ్చేమోకాని వాళ్ళ ఆత్మలు పరిశుద్ధమైనవి. బజార్లో పకోడీలు కొనుక్కు తిన్నా వాళ్ళు ప్యూరిటన్స్, టన్నులకొద్ది నీతిపాఠాలు వప్పచెప్పగల్రు.

# ఆవడల శోషలిజం ఇంటూ ఆధ్యాత్మిక సోషలిజం

**మొ**గుడు పెళ్ళాన్ని కొడితే న్యూస్ కాదు. పెళ్ళాం తిరగబడి మొగుడ్ని కొడితే అది న్యూస్ అవుతుంది. వెంకటప్పయ్య మెట్లమీంచి జారిపడితే అది న్యూస్ కాదు. నారాయణమ్మ వెంకటప్పయ్యను మెడపట్టుకు మెట్లమీంచి క్రిందకు దభాల్న త్రోస్తే అప్పుడెవరేనా చూసి రిపోర్ట్ చేస్తే న్యూస్.... అంచేత రిపోర్టర్ సాక్షాత్తూ నారద మహాముని అంశను జన్మించిన కారణ జన్ముడు. విస్సన్న చెప్పింది వేదంలాగ రిపోర్టర్ తెచ్చింది న్యూస్ - పోర్టర్ తెచ్చేది లగేజీ. అక్కడివిక్కడా, ఇక్కడివక్కడా చెప్పడంలో ఆడాళ్ళు మాంచి రిపోర్టర్స్ అని అనుక్షణం రుజూచేసుకుంటూ వుంటారు. ఆడాళ్ళు పిల్లల్ని మోసుకుంటూ తిరుగుతారు. అంచేత మంచి పోర్టర్స్ కూడా - నేను స్త్రీల దినపత్రిక ఎడిటర్నయితే - ఆడాళ్ళ చేత దెబ్బలూ, చివాట్లూ తిన్న మగాళ్ళ ఫొటోలు వేసి న్యూస్ బాక్సు కట్టి ప్రచురిస్తాను. మొగుడికంటె పొడుగ్గా లావుగా బలంగా భారంగా భయంకరంగా వుండే స్త్రీలను గురించి లేటెస్టున్యూస్ తాజాగా ఎప్పటికప్పుడు అందజేస్తాను. ఐశ్వర్యం, విద్య వుద్యోగం. అందచందాలలో భర్త తలదన్నిన స్త్రీల పాత్రచిత్రణలను వున్నదివున్నట్లుగా లేనిది లేనట్లుగా దడదడా అచ్చువేస్తాను. (సత్యభామ శ్రీకృష్ణుడిని ఎడంకాలితో